


పాపారావు గారింట్లో దొంగలు పడ్డారనీ. చాలామట్టుకు దోచుకు పోయారనిన్నీ విన్న ఆ వూరిలో వారంతా- తమ ఇళ్ళల్లో దొంగతనం జరిగినట్టే భావించి చాలా విచారించారు

అతని విషయంలో అందరూ అలా అనుకున్నారంటే అందుకు అతని పలుకుబడీ మంచి పేరే కారణం!

రెండుసార్లు అతను మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయినాడంటే ఆ వూరిలో అతనంటే ఎంత అబిమానమో తెలిసిపోతుంది. ఆ మంచితనంవల్లనే, యీసారి చైర్మన్‌గా కూడా ఎన్నికయాడు. వచ్చే ఎన్నికలకు ఎమ్. ఎల్. ఏగా నిలబడాలని కొందరు సలహా లిస్తున్నారుకూడ

అతను కౌన్సిలర్ గా వున్నప్పుడే తన పేహాను ఇళ్ళవాళ్ళకి కొళాయిలు వచ్చేట్టు వార్డుకు, కొళాయిలూ, ట్యూబులైట్లూ, చేశాడు. తారు రోడ్డూ వేయించాడు. పది పది ఉపకారం అయితే చేస్తాడుగాని

---

ద్వివేదుల సోమనాధశాస్త్రి

---

దానికి తగ్గట్టుగా 'తింటాడు' అని కూడా కొందరంటారు మరి అవి కిట్టని మాటలో, ఏమో భగవంతునికే తెలియదు.

ఎవరెలా అనుకున్నా లోలోపలే_ పైకిమాత్రం అందరూ మంచివాడనే అంటారుగాని చెడ్డవాడని అనడానికి ధైర్యం చాలదో ఏమో!

ఈ దొంగతనం కూడా పాపారావు గారు వూర్లో వుంటుండగా చేయడానికి ఎవరికయినా ఎన్ని గుండెలుండాలి? అతను సకుటుంబ సమేతంగా, వారిదగ్గర బంధువుల వివాహానికి వెళ్ళినపుడు జరిగింది.

తిరిగి రాగానే వూళ్ళో వాళ్ళందరూ పరామర్శించడంతోనే ఒక నెల్లాళ్ళు వూపిరి తిరక్కుండా పోయింది! ఎంత మంచివారయినా చైర్మన్ గారింట్లో దొంగ తనం జరగడం ఏమంత జరగకూడని పని కాదుగా .. కాని . అక్కడే అందులో విశేషం వున్నది.

ఇంత దొంగతనం జరిగినా చైర్మన్ గారు పోలీసు రిపోర్టు యివ్వలేదు! ఇదిగో యీ పనే అందరినీ ఆశ్చర్యంలో ముంచింది; సన్నిహితులూ, చాలా పరిచయం కల వాళ్ళూ ఎవరయినా "ఏమిటిది వూరుకున్నారేం?" అని అడిగితే_

"పోన్లెద్దురూ అయిందేదో అయిపోయింది_ ఇదంతా శాశ్వతమా ఎలా వచ్చింది అలాగే పోయింది. మళ్ళీ పోలీసులూ, గొడవా_ తీరా యిచ్చినా పోయినవి దొరకడం కల్ల! ఇహ ఈ ఎంక్వయిరీలూ, అవీ, మనస్శిమితం లేకుండా పోవడం_ ఆ పట్టుకుపోయిన వాళ్ళనే బ్రతకనీండి! ఎవడు మూడు ఏళ్ళలు బ్రతకాలి?_" అని నిర్వికారంగా అంటూంటే మరీ మరీ విస్తుపోయారు.

ఈ మాటలు విన్న వారందరికీ_ వెనకటికి బుద్ధుని కథల్లో మహానుభావుడు జ్ఞాపకం వచ్చాడు.

అందుకే అందరూ "మహానుభావులు అందరికీ అలా వూరుకోడం సాధ్యమా?" అనీ_

"మొదటినుండీ అతను అంతే, ఎంత మంచివాడు కాకపోతే .. అంత వితరణ సహనం వుంటుంది? .." అనీ అన్నారు.

"అదేంకాదు ఆయన మాటలు వినలేదా? ఎలా వచ్చింది అలానే పోయింది అంటే అర్థం ఏమిటి? పోయిందంతా అలా ఆర్జించినదే కదా! ఎంతమంది బుర్రలు కొట్టినదో? అందుకే గప్ చిప్ గా తేలుకుట్టిన దొంగలా వూరుకున్నాడు!" అని కూడా కొందరు అనుకోకపోలేదు నేపథ్యంలో.

చైర్మన్ గారింట్లో దొంగతనం విషయం అందరూ మరిచిపోయే వేళకి హఠాత్తుగా మరో వింత ప్రజలలో గుప్పుమంది___

"చైర్మన్ గారింట్లో పోయిన వస్తువులు కొన్ని దొరికాయి. దొంగలని పట్టుకున్నారు!" అన్నది.

"మంచి వాళ్ళకు దేముడే సాయం చేస్తాడు! ఆయన ఒకరికి అన్యాయం చేయలేదు .. కష్టార్జితం కాబట్టి దానంతటదే తిరిగి నడుచుకు వచ్చింది!" అని కొందరంటే___

"ధనవంతుల మాట దేముడే మోస్తాడంటారు_ మనలాటి వాళ్ళింట్లో దొంగతనం జరిగితే మళ్ళీ దొరకడం కూడానా? ఆయన చైర్మన్ కాబట్టి దొరికాయి" అని కొందరన్నారు ___

ఇంతకీ అవి ఎలా దొరికాయీ అంటే "తాడు కదిపితే డొంకంతా కదిలిందంటారే" అచ్చంగా అట్లాగే అయింది చైర్మన్ పాపారావు గారింట్లో దొంగతనం జరిగిన నెల్లాళ్ళలోనే పోలీస్ కమిషనర్ గారింట్లో కూడా దొంగతనం జరిగింది.

ఈ దొంగతనం జరగడం చాలామందికి సరదాగానే వుంది, ఎందుకంటే_ దొంగ యింట్లో కన్నం వేసిన దొంగలంటే మాటలా? అందుకే అదే తాజావార్త అయింది అందరికీ! __

"వీడెవడో దొంగల్లో దొరలా వున్నాడురోయ్! ఎక్కడ వేయాలో అక్కడే వేశాడు!" అని అనుకున్నారు!


ఈ సంగతి అలావుంచి అసలు విషయం మరొకటి వుంది!

తమ స్వంత యింటిలో దొంగతనం జరిగింది కాబట్టి, పోలీస్ కమిషనర్ ప్రసాదరావుగారు, అహోరాత్రులూ, నిద్రాహారాలు మాని, ఆ వూర్లో పాత, క్రొత్త దొంగలను, పురుగులను ఏరినట్టు ఏరి పారేశారు!

ఆఖరికి దొంగ దొరికిపోయాడు కమిషనర్ గారి వస్తువులతోపాటు చైర్మన్ పాపారావుగారి, ప్రాణప్రదమయినవీ_ అతి విలువయినవీ అయిన వస్తువులు, డాక్యుమెంటులూ, కొన్ని దొరికాయి. అదీ విశేషం!

అంతవరకూ బాగానే వుంది! అక్కడే వచ్చింది అసలు తంటా!

చైర్మన్ గారి శ్రేయోభిలాషులు చాలా సంతోషించారు యీ వార్త విని. అది సహజమే కదా? .. కాని ఏదో సామెత చెప్పినట్టు_ అసలు పాపారావుగారికి_ సంతోషం కలగకపోగా, మీదు మిక్కిలి చాలా విచారంతో కృంగిపోడం చూస్తే ఎవరికయినా ఆశ్చర్యం కలగక పోదు!



అందులో ఏం కుంభకోణం వున్నదో మరి!_

చైర్మన్ పాపారావుగారికి, పోలీస్ కమిషనర్ ప్రసాదరావుగారికి పడదని జనం సూచా వాచాకా అనుకుంటున్నా_యీసారి అందరికీ తెలిసిపోయింది. కాని ఎంత పడకపోయినా యిద్దరూ ఎన్నడూ మాటామాటా అనుకోలేదు!

ఇద్దరి మధ్యా పొగలూ, సెగలూ రగులుతున్నా మర్యాద అనే ముసుగు కప్పుకొని ఎవరూ బయట పడేవారు కాదు! పెద్దమనుషుల నిజస్వరూపాలు యిలాగే వుంటాయి కాబోలు!

అయితే ఇప్పుడు జరిగిన సంఘటనలో ప్రసాదరావుగారు, పాపారావుగారికి వారి పోయిన వస్తువులనుకూడా పట్టుకొని వుపకారమే చేశారు గాని_యిందులో అపకారం ఏముంది? అని పామరులు అనుకున్నారు! కాని_

"అసలు పోయిన వస్తువులు దొరకక పోయినా మంచిదే! ఆ దొంగ పట్టుబడకండా వుండినా బావుండేది" అని పాపారావుగారు ఎందరు దేముళ్ళకు మొక్కుకున్నారో!

ఆ దొంగను పట్టుకొని_ ఆ పోయిన సామాన్లను_ అనేకన్నా_ పాపారావుగారి 'యింటిగుట్టు'ను బయట పెట్టి ప్రసాదరావు యీ నాటికి తన 'కసి' తీర్చుకున్నాడు.

తను చిత్తుగా ఓడిపోయినట్టే భావించాడు పాపారావు. ఏ క్షణంలో నయితే తన పోయిన వస్తువులు బయట పడ్డాయని విన్నాడో_ఆ పోయిన వాటిని నెమరు వేసుగుని గుండెలు పట్టుకున్నాడు!

వెంటనే వసుదేవుణ్ణి తలపోస్తూ కమిషనర్ గారింటికి బయలు దేరాడు.

అభినందించడం, కృతజ్ఞత చూపడం, పోయి ప్రాధేయ పడడం మొదలెట్టాడు.

చైర్మన్ గారిని చూస్తూనే కమీషనర్ గారు చిరునవ్వు లొలకబోశారు. అతనికి ముందే తెలుసును పాపారావు తన యింటికిలా రాక తప్పదని. అంచేత 'విష్' కూడా చేయలేదంటే, పాపారావు గారి స్థితి ఎంత దిగజారి పోయిందో తెలుస్తోంది!

"ఏమిటిలా చేశారు?" అనడిగాడు పాపారావు, పాపారావుగా_

"ఏముంది? నా విధి నేను నిర్వర్తించాను!" అన్నాడు కమిషనర్ హోదాలో ప్రసాదరావు.

"నేను మీకేమీ రిపోర్టు యివ్వలేదే?"

"ఎవరు రిపోర్టు యిచ్చినా, యివ్వక పోయినా నేరస్థులను పట్టుకోవడం మా పోలీసుల కర్తవ్యం, ఆ అధికారం మాకు వున్నదని తమకు తెలియదా? ఆ మాటకొస్తే దొంగలందరూ మాకు రిపోర్టు యిచ్చే దొంగతనాలు చేస్తున్నారా? .. అలాగని దొంగలను పట్టుకోడం మానేస్తామా?"

దొంగలు_ దొంగలు అని మాటిమాటికీ ప్రసాదరావు అంటూంటే_ పాపారావుకి అదోలా వుంది. భుజాలు తడుముకుంటున్నట్టు.

"దొంగలను పట్టుకున్నారు సరే!... కాని మా యింట్లో సామాన్లు తిరిగి దొరికినట్టు చెబితే చెప్పేరు అదీ బాగానే వుంది .. కాని_ నాదొక రిక్వెస్టు!"

"కొన్ని బయట పెట్టమంటారు...మరి

★ ఇంగ్లండులో హంఫ్రీ క్రైనాస్టన్ అనే గజదొంగ ఇసబెల్ అనే కులీన స్త్రీని పెళ్ళాడేసి అనక పదేళ్ళలో విడాకులు కూడా ఇచ్చేశాడు. పదిహేను సంవత్సరాల తర్వాత మేరియన్ అనే ఆమెను పెళ్లాడాడు. కాని పాపం! అతనికి మరో పదమూడేళ్ల తర్వాత తన మరణశయ్యపై నున్నప్పుడుగాని ఇసబెల్, మేరీయన్‌లు ఒక్కరేనని తెలియలేదు!

—సేకరణ 'జయ'

కొన్ని వద్దంటారు! అంతేనా?"

"మరేం! బాగా గ్రహించారు!"

"చూడండి మీకు జ్ఞాపకం వుందో లేదో! నేను ఆయా సందర్భాల్లో హెచ్చరిస్తూ వచ్చాను .. కాని అప్పట్లో మీ పదవి చూసుకొని ఖాతరుచేశారు కాదు! ఇప్పుడేం ప్రయోజనం చెప్పండి?"

"అంత నిర్మొహమాటంగా మాటాడకండి.. పదవులు అప్పుడూ వున్నాయి_ యిప్పుడూ వున్నాయి కాకపోతే మనం మనం ఒకటే_ యీ వుపకారం వృత్తినేపోదు!"

"పాపారావుగారూ, క్షమించండి! మేమంత నిర్మొహమాటంగా వుండకపోతే యీ పోలీసు వుద్యోగం ఎలా చేయగలం?"

"మీరు నామీదే యింత కక్షకట్టడానికి కారణంఏమిటో తెలియడంలేదు!"

"ఏదో కొంతమందికి, ఉపకారాలు చేసి, వందిమాగదులను కూర్చుకొని_ పేరు, పలుకుబడి సంపాదించి మసిపూసి మారెడుకాయి చేస్తే లాభం లేదండి! పాపారావుగారూ! . నోరు విప్పలేని ఎంతోమంది_ మీ చర్యలవల్ల నామరూపాలు లేకుండా పోయారు! ఆ సంగతి నాకు తెలుసు!" అని అన్నాడు ప్రసాదరావు గంభీరంగా.

"అయిందేదో అయిపోయింది యీ పదవిలో వున్నాక నేనొక్కడినే అలాటి పనులు చేస్తున్నానా? పోనీలెండి మీ మాటకు నే నెప్పుడు కాదన్నాను? .. మీరూ మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి! మనలో మనకు ముసుగులాట ఎందుకు?"

"మీరు చేసినవన్నీ కోర్టులో ఒప్పేసుకోండి! గవర్నమెంటు విధించిన శిక్ష ఆనందంగా అనుభవించండి. ఇదే నా అభిప్రాయం!"

ఆ మాట విని ఆశ్చర్యపోయాడు పాపారావు! ఎన్నివిధాల ప్రయత్నించినా ప్రసాదరావు లొంగకపోవడం అతనికి విచిత్రంగానే వుంది!

"అలాగే చేస్తే మీ వరకూ రావడం ఎందుకు? మరోసారి ఆలోచించండి! అభివృద్ధిలోకి రావలసినవారు!"అన్నాడు ఆఖరికి.

"మీ వుద్దేశ్యం తెలిసిందిగాని, అలాటి వాటికి ప్రలోభ పడేవాడినికాను అందువల్ల యిక యీ ప్రసంగం అనవసరం .. ఇహ మీరు దయచేయవచ్చు!" అని అక్కడనుండి లేచిపోయాడు ప్రసాదరావు

ఒక పోలీసు కమిషనర్, చైర్మన్‌ని అలాటి మాటలాడి అమర్యాద చేశాడంటే మరో సమయంలో ఎలా పరిణమించేదో

గాని_ ఆ పరిస్థితిలో_ చైర్మన్ పాపారావు తలవంచుకు వెళ్ళిపోక తప్పలేదు!

తర్వాత కోర్టులో_ చైర్మన్ గారింట్లో దొంగతనం చేసిన దొంగ, చైర్మన్ గారూ కూడా బోనులో నిలబెట్టబడడం వింతలో వింత అయింది!

కాకపోతే చైర్మన్ గారింట్లో దొంగలించిన దొంగ, అసలు గవర్నమెంటు దొంగను పట్టించాడు!

చైర్మన్ గారింట్లో దొంగతనం చేసినందుకు ఆ పేరులేని దొంగనూ, గవర్నమెంటును మోసం చేసినందుకు పేరున్న పాపారావునీ పట్టుకున్నారు.

చైర్మన్ పాపారావుగారి అసలు స్వరూపం బయలుపడి అందరూ ముక్కుల మీద వ్రేళ్ళుంచుకున్నారు.

"దీనివెనక ఏదో రాజకీయపు ఎత్తు వుందని" కొందరన్నారు!

"ఈ దొంగతనం యాదృచ్ఛికంగా జరిగింది కాదని జరిపించిందని" కూడా మరికొందరు అన్నారు.

"కమిషనర్ గారింట్లో దొంగతనం జరగనేలేదని_ కాని ఆ మిష మీద చైర్మన్ గారింట దొంగతనంలో దొరికిన 'విలువయిన' వస్తువులను బయటపెట్టి పాపారావును పట్టుకోడం కోసం ఎవరో చేసిన తంత్రం యిదంతా!" అని కూడా చెప్పుకున్నారు.

"అసలు చైర్మన్ గారింట్లో ఈ ఎత్తు మీదే దొంగతనం జరిగిందని" నిశ్చయించారు కొందరు

ఆ పోయిన వాటిల్లో చాలా "బ్లాక్ మనీ"కి సంబంధించిన కాగితాలూ లేండ్ సీలింగ్ వచ్చాక భూముల పంపకాలకు సంబంధించిన రహస్య పత్రాలూ బేంక్ ఎంకౌంట్లూ, యిలాటివెన్నో బయట పడ్డాయి.

ఇదంతా ఒక పథకం మీదే జరిగిందని అందరకూ తెలిసిపోయింది

చాలా కాలంనుండి చైర్మన్ పదవికి పోటీచేస్తూ పాపారావుగారి పలుకుబడికి విసిగిపోతూ వున్న "రాజారావు" ఆ స్థానాన్ని ఆక్రమించడానికి వేసిన ఎత్తే యీ రాజకీయ చదరంగంలో ఒక భాగమని, పాపారావుగారి పతనానికి యిదే కిటుకని చాలామందికి తెలియదు! *

---

★ 'పురుషుడికి స్వర్గప్రవేశం లేకుండా చేసేది 'పాపం.' ఆ పాపానికి పునాది స్త్రీ. అందుచేత ఈ యూనివర్శిటీలో స్త్రీలకు ప్రవేశము నిషేధించబడినది.'

1377 లో ఇటలీలోని బొలోనా యూనివర్శిటీ చేసిన ప్రకటనలోని మొదటి వాక్యమిది. అంతకుముందు విశ్వవిద్యాలయాలలో స్త్రీలు చదువుతున్నప్పటికీ యీ ప్రకటన తర్వాత అతి స్వల్పకాలంలోనే పాశ్చాత్య దేశాలలోని విశ్వవిద్యాలయాలన్నీ స్త్రీల ప్రవేశం నిషేధించాయి. 456 సంవత్సరాల తర్వాతగాని ఉన్నత విద్యకు స్త్రీల కవకాశం కలుగలేదు. 1833 లో ఓహియోలోని ఒబర్లిన్ కాలేజి స్త్రీలకు విద్యాలయ ప్రవేశం పునః ప్రారంభించింది.

—సేకరణ : 'జయ'